Title Code: TELTEL 02105

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

Malkajgiri | Volume: 2 | Issue: 158 | Friday, September 6, 2024 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-


మల్కాజ్‌గిరి | సంపుటి : 2 | సంచిక : 158 | శుక్రవారం, సెప్టెంబర్ 6, 2024 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /-

# ఏఐ అంతర్జాతీయ కేంద్రంగా హైదరాబాద్




**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరాన్ని కృత్రిమ మేధస్సు(ఏఐ)కి అంతర్జాతీయ కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అందులో భాగంగానే తమ ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న ఫోర్త్ సిటీలో ఏఐ కార్యకలాపాల కోసం 200 ఎకరాలను కేటాయించిందని చెప్పారు. హెచ్ఐసీసీలో గురువారం రాష్ట్ర ఐటీ శాఖ నిర్వహించిన ఏఐ గ్లోబల్ సమ్మిట్‌ను ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త టెక్నాలజీలతో సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని అన్నారు. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ సైతం కొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారిందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐకి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన తమ ప్రభుత్వం ఏఐ కార్యకలాపాల కోసం ఫోర్త్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. వ్యవసాయం, వైద్య, ఆరోగ్యం, విద్య, ప్రజా రవాణా వ్యవస్థల్లో ఏఐ వినియోగంపై ఇండస్ట్రీ నిపుణులతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఏఐ సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రంలో రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలతో కూడి కార్యాలయ స్థలాన్ని ఏఐ ఆధారిత కంపెనీల కోసం అందుబాటులో ఉంచుతామని చెప్పారు. వివిధ సంస్థలతో 26 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. రెండ్రోజులు జరిగే సదస్సులో 50కి పైగా స్టార్టప్‌లతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే తమ ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న ఫోర్త్ సిటీలో ఏఐ కార్యకలాపాల కోసం 200 ఎకరాలను కేటాయించిందని చెప్పారు. హెచ్ఐసీసీలో గురువారం రాష్ట్ర ఐటీ శాఖ నిర్వహించిన ఏఐ గ్లోబల్ సమ్మిట్‌ను ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐకి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన తమ ప్రభుత్వం ఏఐ కార్యకలాపాల కోసం ఫోర్త్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు.

# ఉక్రెయిన్‌తో మధ్యవర్తిత్వం ఆ మూడు దేశాలకే సాధ్యం: పుతిన్



మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం నివారించడానికి శాంతి చర్చలకు భారత్, చైనా, బ్రెజిల్ దేశాలు మధ్యవర్తిత్వం వహించగలవని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గత రెండున్నరేళ్లుగా ఉక్రెయిన్‌తో నిర్విరామ పోరుసాగిస్తున్న రష్యా శాంతి చర్చలను ప్రస్తావించడం ముఖ్యమైన పరిణామం. వ్లాదివాస్తోక్‌లో జరుగుతున్న ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు సందర్భంగా పుతిన్ ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని వెల్లడించారు. తాము ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధంగానే ఉన్నామని తెలిపారు. భారత ప్రధాని నరేంద్రమోడీ ఉక్రెయన్‌లో పర్యటించి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపిన రెండు వారాలకు పుతిన్ నుంచి శాంతి చర్చల ప్రస్తావన రావడం గమనార్హం. "మా మిత్రులను, భాగస్వాములను మేం గౌరవిస్తాం. యుద్ధంతో ముడిపడి ఉన్న అన్ని సమస్యలను వారే పరిష్కరించగలరన్న విశ్వాసం ఉంది. ఇదే సమయంలో పుతిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ అత్యంత నిర్మాణాత్మక, స్నేహపూర్వక సంబంధాలు పుతిన్, మోడీ మధ్య ఉన్నాయని, ఉక్రెయిన్‌తో యుద్ధ సంక్షోభాన్ని నివారించే మధ్యవర్తిత్వానికి మోడీ నాయకత్వం వహించగలరని పేర్కొన్నారు.

# డికెజడ్ రూ.500 కోట్లు ధోకా!



**సిటీ బ్యూరో :** పెట్టుబడుల పేరుతో వందల కోట్లు ఛీటింగ్ చేసిన కేసులో హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డికేజెడ్ టెక్నాలజీస్ నిర్వాహకులు పరారీలో ఉండడంతో వారిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఛీటింగ్ కేసు బయటికి రావడంతో వేలాది మంది బాధితులు బయటికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. మాదాపూర్‌లోని సమృద్ధి వశ్యం భవనంలో ఇక్బా ల్, రాహిల్ డీకేజెడ్ టెక్నాలజీస్ సంస్థను ఏర్పాటు చే శారు. తమ సంస్థ ద్వారా ఆహార ధాన్యాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు తదితరాలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తామని ప్రచారం చేసుకున్నారు. వస్తువులను విక్రయించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్, యాప్‌ను రూపొందించారు. అంతేకాకుండా తమ వద్ద పెట్టుబడి పెట్టిన వారికి ప్రతి నెలా 8 నుంచి 10 శాతం వడ్డీ చెల్లిస్తామని చెప్పారు. దీంతో చాలా మంది తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టారు. వీరికి వడ్డీ చెల్లించడంతో భారీ ఎత్తున డబ్బులు పెట్టుబడిగా పెట్టారు. ఎక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పడంతో భారీ ఎత్తున డబ్బులు పెట్టుబడిగా పెట్టారు. ఇలా దాదాపుగా 60 వేల మంది బాధితుల నుంచి రూ.500 కోట్లు వసూలు చేసిన నిందితులు తర్వాత వడ్డీ చెల్లించడం ఆపివేశారు. ఇదే సంస్థలో ముందుగా బాధితులు మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పండుగల ఆఫర్లు% %పెట్టుబడుల పేరుతో డబ్బులు వసూలు చేసిన నిందితులు ఎక్కువ పెట్టుబడి పెట్టిన వారికి వడ్డీ 12 నుంచి 13.5 శాతం వడ్డీ ఇస్తామని ప్రచారం చేశారు. వీరు తయారు చేసిన యాప్ ద్వారా వస్తువులు కొనుగోలు చేసిన వారికి 10 నుంచి 15 శాతం ప్రత్యేక రిబేట్ ఉంటుందని నమ్మించారు. తమ సంస్థలో పెట్టుబడి పెట్టిన వారికి ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తామని చెప్పారు. ఇలాంటి మాటలు నమ్మిన దాదాపు 60 వేల మంది రూ.500 కోట్ల వరకు పెట్టుబడిగా పెట్టారు. చాలా మంది బాధితులు తమ వద్ద ఉన్న డబ్బులతోపాటు, చిట్టీలు ఎత్తి, అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. లక్ష రూపాయల నుంచి కోట్లాది రూపాయలు పెట్టుబడి పెట్టారు.

# మమత సర్కార్......

## తప్పు మీద తప్పు చేస్తుంది: బెంగాల్ గవర్నర్



కోల్‌కత: రాష్ట్రంలో తప్పు మీద తప్పు జరుగుతోందని పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్ గురువారం వ్యాఖ్యానించారు. కోల్‌కతలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో గతనెల ఒక పిజి ట్రెయినీ డాక్టర్ హత్యాచార ఘటనపై న్యాయం కోరుతూ పెద్ద పెట్టున నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తప్పు మీద తప్పు చేస్తోందని ఆయన విలేకరులతో మాట్లాడుతూ గవర్నర్ ఆరోపించారు. ప్రభుత్వం పట్ల ప్రజలలో విశ్వాసం కొరవడినందువల్లనే ఈ నిరసనలు వ్యక్తమవుతున్నాయని బుధవారం రాత్రి పెద్ద ఎత్తున జరిగిన నిరసనలను ప్రస్తావిస్తూ ఆయన వ్యాఖ్యానించారు. పాలన యంత్రాంగం తప్పు మీద తప్పు చేస్తున్నట్లు తాను గమనించానని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఒక పక్క చర్యలు తీసుకుంటూనే మరో పక్క ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవలసి ఉంటుందని ఆయన అన్నారు. నేరస్థులను శిక్షించాల్సి ఉంటుందని కూడా ఆయన అన్నారు. ప్రభుత్వం నుంచి తమకు న్యాయం లభిస్తుందని బెంగాల్ ప్రజలు భావించడం లేదని, ఇందుకు బుధవారం అర్ధరాత్రి వరకు జరిగిన నిరసన ప్రదర్శనలే ఉదాహరణని ఆయన చెప్పారు.

# జగన్‌కు ప్రాణహాని నిజమే



**హైదరాబాద్ :** మాజీ సీఎం, ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రాణహాని ఉందని స్టేట్ సెక్యూరిటీ రివ్యూ కమిటీ అంగీకరించింది. అందుకే జెడ్ ప్లస్ భద్రతను కొనసాగించాలని సిఫారసు చేసినట్టు తెలిపింది. 2014 లో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎం పదవి నుంచి తప్పుకున్నాక ఆయనకు వై క్యాటగిరీ భద్రత ఉన్నదని హైకోర్టుకు వివరించింది. ఎమ్మెల్యేగా జగన్ 1o1 భద్రతకే అర్హులని ఎస్ఆర్సీ తేల్చింది. తన భద్రతను తగ్గించేశారని, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ముందున్న తన భద్రతను కొనసాగించేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ వైఎస్ జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి కౌంటర్ హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు రాష్ట్రస్థాయి సెక్యూరిటీ రివ్యూ కమిటీని గతంలో ఆదేశించింది. ఈ మేరకు ఎస్ఆర్సీ తరపున ఐఎస్‌డబ్ల్యూ డీఐజీ, ఎస్పీఎస్ నచికేత్ విశ్వనాథ్ కౌంటర్ దాఖలు చేశారు. ఈ కేసులో తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 13కు వాయిదా వేసింది.

# మరో అఫ్ఘానిస్థాన్‌గా బంగ్లాదేశ్‌ను మార్చే కుతంత్రం


## – తస్లీమా నస్రీన్

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్‌ను మరో అఫ్ఘానిస్థాన్‌గా లేదా ఇరాన్‌గా మార్చాలని ఇస్లామిక్ రాడికల్స్ కుతంత్రం చేస్తున్నారని, భారత్ వ్యతిరేకులుగా, హిందూ వ్యతిరేకులుగా, పాకిస్థాన్‌కు అనుకూలురుగా యువకుల మనస్సు మారేలా బోధనలు చేస్తున్నారని ప్రఖ్యాత రచయిత్రి, ఉద్యమ నాయకురాలు తస్లీమా నస్రీన్ వెల్లడించారు. "లజ్జ" రచయిత్రి అయిన నస్రీన్ బంగ్లాదేశ్ నుంచి బహిష్కరణ అయిన తరువాత 2005 నుంచి భారత్‌లో నివసిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థుల కోటా ఉద్యమానికి తాను, మరికొందరు మొదట్లో మద్దతు అందించామని చెప్పారు. అయితే తరువాత ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులకు వ్యతిరేకంగా హింసాత్మక దాడులు జరగడం, జర్నలిస్టులను టార్గెట్ చేసుకోవడం, జైళ్ల నుంచి ఉగ్రవాదులను విడిపించడం విగ్రహాలను, శిల్పాలను, మ్యూజియంలను కూల్చివేయడం, తదితర సంఘటనలు జరుగుతుండడంతో ఇది విద్యార్థుల ఉద్యమం కాదని తెలుసుకున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ ఆందోళనలకు ఇస్లామిస్ట్ జిహాదీలు నిధులు అందిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితికి మాజీ ప్రధాని హసీనాయే కారకురాలని నస్రీన్ ఆరోపించారు. అధికారంలో శాశ్వతంగా ఉండడానికి ఆమె మతాన్ని ఉపయోగించుకున్నారని, సెక్యులర్ స్కూళ్లకు బదులు ఇస్లామిస్టులను సంతృప్తి పర్చడానికి 560 మసీదులను, మదర్సాలను హసీనా



నిర్మింప చేశారని పేర్కొన్నారు. భారత్‌లో నివసించడానికి అనుమతించే రెసిడెంట్ పర్మిట్ జులై 27 నాటికే చెల్లిపోయిందని, సాధారణంగా ఆ తేదీకి ముందే రెన్యువల్ చేయించాల్సి ఉందన్నారు.

# రిలయన్స్ ఇండస్ట్రీస్ బోనస్ షేర్ ఇష్యూకు ఆమోదం!




ముంబై: దేశంలో అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ గురువారం(సెప్టెంబర్ 5న) బోనస్ షేర్ల జారీకి ఆమోదం తెలిపింది. ప్రతి ఒక్క షేరుకు మరో షేరు బోనస్ గా ఇవ్వనున్నది. అయితే అది రికార్డ్ తేదీన ఇస్తారు. కానీ ఆ రికార్డ్ డేట్‌ను ఇంకా నిర్ధారించలేదు. త్వరలో తెలుపుతారు. అంతేకాక ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్ పెంపును సిఫారసు చేసింది. రిలయన్స్ కంపెనీ బోర్డు ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్ ను రూ. 15000 కోట్లను రూ. 50 000 కోట్లు(5.96 బిలియన్ డాలర్లకు) పెంచుతూ సిఫారసు చేసింది. 2017 తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ బోనస్ షేర్ల ఇవ్వడం ఇప్పుడే మళ్లీ. ఇదివరలో(2017లో) బోనస్ షేర్లు ప్రకటించినప్పుడు షేరు ధర రూ. 700 గా ఉండింది. అప్పటి నుంచి ఈ కంపెనీ షేరు ధర బాగా పెరిగింది.

తెలంగాణ షాన్

## సంపాదకీయం

# రైతు 'పంట' పండించిన బడ్జెట్..!

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి బడ్జెట్‌లో రైతుకు, వ్యవసాయానికి పట్టం కట్టింది. కొత్త సంక్షేమ పథకాలు ఏవీ లేవని బడ్జెట్‌పై చర్చలో కేసీఆర్ విమర్శలు గుప్పించినప్పటికీ ఇది రైతు పంట పండించనున్న బడ్జెట్‌గా చెప్పాలి.వ్యవసాయశాఖకు భారీగా రూ.72,659 కోట్లు కేటాయించగా, రూ.2లక్షల రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లను అదనంగా కేటాయించారు. తొలిసారిగా రైతు కూలీలకు కూడా పట్టాలతో సంబంధం లేకుండా ఏడాదికి 12 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పడం ముదావహం. అలాగే రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లను కేటాయించి మంత్రి నివ్వెరపరిచారు. సంక్షేమానికి రూ.40 వేల కోట్లు కేటాయించారు. దీంతో అప్పుల చెల్లింపుతో పాటు ప్రజా ప్రయోజనాలకు కూడా భారీగా వ్యయం చేయనున్నట్లు రాష్ట్ర బడ్జెట్ పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. మొత్తం బడ్జెట్ వాల్యూ 2,91,159 లక్షల కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు, మూలధనం వ్యయం రూ.33,487 కోట్లుగా ఉంది. ఈ క్రమంలో వ్యవసాయశాఖకు భారీగా రూ.72,659 కోట్లు, సంక్షేమానికి రూ.40 వేల కోట్లు, సాగునీటి రంగానికి రూ.26 వేల కోట్లు కేటాయించారు. ఇవే కాకుండా పంచాయతీరాజ్ శాఖకు రూ.29, 816 కోట్లు, విద్యాశాఖకు రూ.21,292 కోట్లు, వైద్యారోగ్య శాఖకు రూ.11, 468 కోట్లు. ఎస్టీ సంక్షేమానికి రూ.17,056 కోట్లు. ఎస్సీ సంక్షేమానికి రూ. 33,124 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.9200 కోట్లు, ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు, మొత్తం హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు రూ.1500 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. మొత్తం రూ.72,659 కోట్లను రైతాంగానికి కేటాయించింది. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలకు ఆ నిధులను వినియోగించనుంది. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యానవన పంటలు, ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇప్పటికే రుణమాఫీ తొలివిడతలో లక్ష వరకు రుణాలు ఉన్న అన్నదాతల అకౌంట్లలో నగదు జమ చేసిన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోపు 2 లక్షల మేర రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేసింది. అలాగే తాము ఇస్తానన్న 15 వేల రైతు భరోసా పథకాన్ని అమలు చేసే విధంగా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. ఈ పథకానికి మార్గదర్శకాలు ఎలా ఉండాలనేది ఈ బడ్జెట్ సమావేశాల్లోనే.. చర్చించి తుది నిర్ణయం తీసుకుని అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో చివరి రైతు వరకు సంక్షేమ ఫలాలు అందలనేదే సర్కార్ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఆర్థిక భద్రత కరువై పని దొరకని రోజుల్లో రైతు కూలీలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టాలు ఉన్న రైతులకే భరోసా నిచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాలు లేని పేద రైతులను గాలికొదిలేసింది. వారందరినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టబోతోంది. రైతు కూలీల ఆర్థిక, జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు అందిచనున్నట్లు పేర్కొంది. ఈ పథకానికి కూడా ఈ సంవత్సరంలోనే శ్రీకారం చుట్టుబోతున్నట్లుగా మంత్రి ప్రకటించారు. అయితే దేశ చరిత్రలో భూమి లేని పేద రైతులకు నగదు పంపిణీ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పులు పది రెట్లు పెరిగాయి తప్ప తెలంగాణ ఆకాంక్షలు తీరలేదని బడ్జెట్ సమర్పణ సందర్భంగా ఆర్థికమంత్రి ప్రకటించారు. బంగారు తెలంగాణ చేస్తామని అప్పుల తెలంగాణను మిగిల్చారని ఆరోపించారు. కోట్లాది ప్రజల ఆశల మేరకు ఉద్యోగాలు, నీళ్లు దక్కకపోగా ఒంటెద్దు పోకడలతో ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేశారని, అప్పుల పెరగడంతో పాటు బిల్లుల బకాయిలు భారీగా పెరిగాయని మంత్రి తెలిపారు. కొత్త ఉద్యోగాలు సృష్టించడానికి బదులు ఉన్న ఉద్యోగాలను కూడా ఇవ్వలేదని, జీతాలు పెన్షన్ చెల్లింపులు సైతం చేయలేని దుస్థితి ఏర్పడిందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ పరిస్థితుల్లో పదేళ్ల తర్వాత వాస్తవిక బడ్జెట్ ప్రవేశపెట్టామని మంత్రి చెప్పుకొచ్చారు. అయితే ఆరు గ్యారెంటీల అమలు విషయంలోనే మల్లగుల్లాలు పడుతున్న ప్రభుత్వం వాటితోపాటు ప్రకటించిన భారీ స్థాయి నజరాలను ఎలా చెల్లిస్తుందనేదే అసలు సమస్య. కేంద్ర సహాయంపై ఆశలు కూడా ఆవిరవుతున్న వేళ.. కాంగ్రెస్ ప్రభుత్వ తొలి బడ్జెట్ సాహసోపేతమైన ప్రకటన అనే చెప్పాల్సి ఉంటుంది. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఆసరా పెన్షన్ల పెంపు, విద్యా భరోసా కార్డు, జాబ్ క్యాలెండర్ వంటి గుదిబండలను దాటుకుని రాష్ట్ర ప్రభుత్వం తన హామీలన్నింటినీ క్రమంగా నెరవేరుస్తుందని ఆశిద్దాం.

# బౌరంపేట్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు







**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 5 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజ్ గౌడ్** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ బోరంపేట్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బీజేపీ నాయకులు పీసరి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల ను ఘనంగా సన్మానించి బహుమతులు ప్రదానం చేయడం జరిగింది కృష్ణారెడ్డి మాట్లాడుతూ పూర్వ ఉపాధ్యాయులైన భారత మాజీ రాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది. గురువులేని విద్య గుడ్డివిద్య ఎవరు ఎంతటి స్థాయికి ఎదగాలన్నా దానికి ఉపాధ్యాయులు నేర్పిన ఉత్తమ పాఠాలే, వారు ఆశించేది కేవలం తన దగ్గర విద్యనేర్చుకున్న విద్యార్థి ఉన్నత స్థాయి కి చేరాడంటే అంతకుమించి ఆనందం వారికి ఇంకొకటి ఉండదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు ప్రభావతి గారు, ఉన్నత పాఠశాల పధానోపాధ్యాయులు రాంరెడ్డి గారు జయేశ్వర్ ఎస్ఎంసి వైస్ చైర్మన్ బల్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జె.ఎస్. మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్







**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 5 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజ్ గౌడ్** కూకట్ పల్లి డివిజన్ అస్ బెస్టాస్ కమాన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెఎస్ మెడికల్ & జనరల్ స్టోర్ ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ రావు తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగద్గిరి గుట్ట డివిజన్ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, డాక్టర్ సునీత, డాక్టర్ బాలలింగం, డాక్టర్ శౌకత్ అలీ, ఫెరోజ్, నరేష్, మహమూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణి





**సికింద్రాబాద్,05 సెప్టెంబర్ (తెలంగాణ షాన్):**
మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని మహంకాళి ఎసిపి సర్దార్ సింగ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం రాంగోపాల్ పేట్ డివిజన్ సోమసుందరం వీధిలో మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 మట్టి వినాయకులను భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పూర్వం మట్టి విగ్రహాలనే పూజించేవారని,ఆ సాంప్రదాయాన్ని కొనసాగించే విధంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన మక్తాల ఫౌండేషన్ వారికి అభినందనలు తెలిపారు. అనంతరం మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మక్తాల జలంధర్ గౌడ్ మాట్లాడుతూ.... ప్రకృతి పరిరక్షణ కోసం మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 సంవత్సరాల నుండి ఉచిత మట్టి గణపతుల పంపిణీ చేస్తున్నామని,పిఓపి ద్వారా తయారు చేసే విగ్రహాల వల్ల నీటి కాలుష్యం ఏర్పడడమే గాక జలాశయాలలో ఉండే జలచరులకు కూడా చేటు చేస్తుందని,ఆ జలచరులను తిన్న మనుషులకు కూడా ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. మట్టి వినాయకులను పూజిస్తూ పర్యావరణాన్ని రక్షించడం మన మానవాళి బాధ్యతగా మక్తాల ఫౌండేషన్ వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి ఇన్స్ పేక్టర్ పరశురాం,మార్కెట్ ఇన్స్ పెక్టర్ రాఘవేందర్,విశ్వకర్మ సంఘం అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్,ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కర్ చారి, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ మాజీ ధర్మకర్త సదానంద్, వెంకటేశ్వర పెరుమాళ్ దేవస్థానం మాజీ ధర్మకర్త తేజ్ పాల్, ఫౌండేషన్ సభ్యులు సుబ్రహ్మణ్యం, శివ కుమార్ చారీ, శివరతన్, వెంకటేష్, పూర్ణ చందర్, రాజశేఖర్, ప్రకాష్, శ్రవణ్, వాణిశ్రీ, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి : ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు





**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 5 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజ్ గౌడ్** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, సంఘ సభ్యులు కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. అదే విధంగా పలు ప్రాంతాలలో ఏర్పాటు చేయనున్న గణపతి ఉత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు.

# ఇమ్యూనిటీ ఆరోగ్యానికి రక్షరేకు

రోగ నిరోధక శక్తి మనకు ప్రకృతి సిద్ధంగానే వస్తుంది. అయితే, కాలంతోపాటు మన జీవనశైలి, ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయి. దీంతో మనలో స్వయం సిద్ధంగా ఉండే రోగ నిరోధక శక్తి తగ్గిపోయి చిన్నపాటి ఇన్ఫెక్షన్లకే అనారోగ్యం బారినపడే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఒకప్పుడైతే ఎంత పెద్ద జ్వరం వచ్చినా ఇంటి చిట్కాలతోనే నయం చేసుకునేవాళ్లు. ఇప్పుడు మాత్రం చిన్నపాటి జలుబును కూడా తట్టుకునే పరిస్థితి లేదు. మందుబిళ్ల నోట్లో పడాల్సిందే! కారణం%ఀ% మన శరీరంలో రోగ నిరోధక శక్తి తగినంతగా లేకపోవడమే. ఈ క్రమంలో అసలు రోగ నిరోధక శక్తి అంటే ఏంటి? అది మనకు ఎలా సమకూరుతుంది? ఈ ఇమ్యూనిటీ పవర్ పెరగాలంటే ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలి? ఏ ఆహారం తీసుకోవాలి? మొదలైన విషయాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం. ప్రతి మనిషిలో రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) అనేది ప్రకృతి సిద్ధంగానే సమకూరి ఉంటుంది. మన రక్తంలోని తెల్ల రక్తకణాలు శరీరానికి సైనికుల్లా పనిచేస్తాయి. ఇవి బయటి పరిసరాల నుంచి దాడిచేసే ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియాను శరీరంలోకి చొరబడకుండా రక్షిస్తాయి. ఒకవేళ కొవిడ్ 19 లాంటి వైరస్‌లు శరీరంలోకి ప్రవేశిస్తే, వాటితో తెల్ల రక్తకణాలు పోరాడతాయి. ఈ విధంగా పోరాడే తెల్ల రక్తకణాల సంఖ్యను లేదా శక్తినే రోగ నిరోధక శక్తి అని పేర్కొంటారు. ఇది మనం తీసుకునే రోజువారీ ఆహారం, శారీరక శ్రమతోనే లభిస్తుంది. అలా సమకూరని వారికి మాత్రం ఔషధాల రూపంలో ఇవ్వాల్సి వస్తుంది. ఈ కాలాల్లో అత్యవసరం రోగ నిరోధక శక్తి అనేది వర్షకాలం, శీతకాలంలో అత్యవసరం. ఎందుకంటే వానాకాలం, చలికాలంలో డెంగీ, మలేరియా, ఫ్లూ వంటి సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతుంటాయి. వీటిని సమర్థంగా ఎదుర్కోవడానికి మన శరీరంలో తగినంత రోగ నిరోధక శక్తి ఉండాలి. ఈ పవర్ లేకపోతే వచ్చిన వ్యాధులు త్వరగా తగ్గకపోవడమే కాకుండా రోగి తీవ్ర అనారోగ్యానికి గురవుతాడు. తరచూ వ్యాధుల బారినపడాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ప్రధానంగా వేసవి నుంచి వర్షకాలానికి మారుతున్న సంధి దశలో శరీరానికి ఇమ్యూనిటీ ఎంతో అవసరం. వానాకాలంలో సాధారణంగా డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు వస్తుంటాయి. రోగ నిరోధక శక్తి బాగా ఉన్నవారిలో బయటినుంచి యాంటి బయాటిక్స్ అవసరం లేకుండానే ఇలాంటి జ్వరాలను శరీరం తట్టుకుంటుంది. ఇక మనలో ఇమ్యూనిటీ పవర్ పెరగడానికి కొన్ని ప్రాథమిక జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. రోజువారి జీవనశైలి, ఆహారపు అలవాట్లలో స్వల్ప మార్పులు చేసుకోవడం వల్ల దీర్ఘకాలికంగా మంచి ఫలితాలు ఒనగూరుతాయి. ఇమ్యూనిటీకి బాటలు వ్యక్తిగత పరిశుభ్రత పట్ల శ్రద్ధ చూపాలి. బయటికి వెళ్లి వచ్చిన వెంటనే, భోజనానికి ముందు, మల, మూత్ర విసర్జన తర్వాత కాళ్లు, చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. రోగ నిరోధక శక్తి పెరగడానికి ఆహారపు అలవాట్లతోపాటు వ్యాయామం, తగినంత నిద్ర కూడా చాలా అవసరం. రోజుకు కనీసం 40 నిమిషాల చొప్పున వారంలో 5 రోజులు వ్యాయామం చేయడం మంచిది నడకకు వెళ్లే వాళ్లు రోజుకు కనీసం ఏడు వేల నుంచి ఎనిమిది వేల అడుగులు వేయాలి. డెస్క్ ఉద్యోగాల్లో ఉన్నవాళ్లు గంటకు ఒక్కసారైనా కూర్చున్న చోటు నుంచి లేచి, కొంచెం దూరం నడవాలి స్కిప్పింగ్ వల్ల కాళ్ల కండరాలు, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. 60 ఏళ్లు దాటినవాళు స్కిప్పింగ్ చేయలేని పరిస్థితుల్లో సైక్లింగ్ చేయవచ్చు వయసులో ఉన్నవాళ్లయితే జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్ చేయడం ఉత్తమం. లేదంటే శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇచ్చే ఏవైనా క్రీడలు ఆడాలి యోగా చేస్తే శరీరం ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. ప్రాణాయామం వల్ల మెదడు, ఇతర అవయవాలకు తగినంత ఆక్సిజన్ అందుతుంది ఆహారంతో రోగ నిరోధకత రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలంటే విటమిన్-సి, విటమిన్-ఇ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. వీటిలో యాంటిఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరగడంలో ఎంతో దోహదపడతాయి. పల్లీలు, పిస్తాపప్పు, ఎండుద్రాక్ష, కుంకుమపువ్వులో సరిపడా యాంటి ఆక్సిడెంట్స్ ఉంటాయి. పసుపు, తులసి, అల్లం, వెల్లుల్లిలో యాంటి ఆక్సిడెంట్లతోపాటు యాంటిబ్యాక్టీరియల్ గుణాలు కూడా ఉంటాయి. ప్రతిరోజూ చాయ్‌లో అల్లం లేదా తులసి, పాలల్లో అయితే పసుపు వేసుకుని తాగడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దానిమ్మ, స్ట్రాబెర్రీ, కర్బూజ, తర్బూజ పళ్లు తింటే శరీరానికి తగినన్ని విటమిన్లు, యాంటి ఆక్సిడెంట్స్ పుష్కలంగా దొరుకుతాయి. ఇవి కూడా రోగ నిరోధక శక్తి పెరగడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. సమతుల ఆహారానికి పెద్దపీట వేస్తూనే, ధూమపానం, మద్యపానం లాంటి దుర్వ్యసనాలను వదిలించుకోవాలి.

విటమిన్-సి ఉన్న పదార్థాలు
నారింజ
బత్తాయిజి
నిమ్మ మొదలైన సిట్రస్ జాతి పళ్లు
విటమిన్-ఇ ఉన్న పదార్థాలు
అవకాడో
కివీజి
బాదం
పాలకూరజి
బొప్పడి పండు

ఆహారంతోపాటు హైడ్రేషన్.. వర్షకాలం, చలికాలంలో రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీరు, వేసవిలో అయితే 4 లీటర్ల నీరు తప్పనిసరిగా తాగాలి. వానాకాలంలో కూరగాయలు, ఆకుకూరలు శుభ్రంగా కడిగాకే వాడుకోవాలి. వర్షకాలంలో టైఫాయిడ్ సహా వివిధ వ్యాధులు రావడానికి కలుషితమైన నీరే ప్రధాన కారణం. కాబట్టి వర్ష రుతువులో బయటి ఆహార పదార్థాలను సాధ్యమైనంత వరకు దూరం పెట్టడమే ఉత్తమం. ఇక మాంసాహారులు మాంసాన్ని చక్కగా శుభ్రం చేసి బాగా ఉడికించి తినాలి. చేపల్లో విటమిన్-ఇ, ఒమేగా- 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెకు మేలుచేస్తాయి. మంచి నిద్ర ఎంతో మంచిదిమనిషికి ఆహారం, వ్యాయామం ఎంత ముఖ్యమో నాణ్యమైన నిద్ర అంతే ప్రధానం. ప్రతిరోజూ వయసుతో నిమిత్తం లేకుండా కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటల నాణ్యమైన నిద్ర అవసరం. రాత్రివేళ త్వరగా పడుకుని పొద్దునే తొందరగా లేచి చేసే వ్యాయామం మంచి ఫలితాలను ఇస్తుందని వివిధ అధ్యయనాలు వెల్లడించాయి. సరైన నిద్ర వల్ల శరీరంలో హార్మోన్ల సమతుల్యత ఏర్పడుతుంది. త్వరగా లేచి వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడి కూడా తగ్గుతుంది. మన రోగ నిరోధక శక్తి తగ్గడంలో ఒత్తిడికీ పాత్ర ఉంటుంది. కాబట్టి మానసిక ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలి.

# కాపాడలేకపోయిన కోట్లు



**హైదరాబాద్ :** రెండు తెలుగు రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు బీభత్సం సృష్టించాయి. భారీ వరదలతో జన జీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. వేల ఇండ్లు నీట మునిగిపోవటంతో లక్షల మంది నిరాశ్రయులయ్యారు. విజయవాడ, ఖమ్మం జిల్లాల్లో అయితే పరిస్థితి ఘోరంగా ఉంది. ఇక భారీ వరదలకు హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలు కూడా ప్రభావితమయ్యాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలే కాదు కోటీశ్వర్లు కూడా వరద బాధితులుగా మారి రోడ్డున పడ్డారు. కోట్లు, ఖర్చు చేసి ఖరీదైన, విలాసవంతమైన విల్లాలు కొనుగోలు చేసిన వారు కూడా ఆకలితో అలమటిస్తున్నారు. ప్రకృతి ప్రకోపానికి పేద,ధనిక తేడా లేదనటానికి ఈ ఘటనే ఉదాహరణ అని పలువురు పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.గత రెండ్రోలుజు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు హైదరాబాద్ శివారు శంకర్‌పల్లి మండలం మోకీల పరిధిలోని పలు విల్లాలు నీట మునిగాయి. లా పలోమా విల్లాస్ కమ్యూనిటీలోకి భారీగా వరద నీరు పోటెత్తింది. అక్కడ సుమారు 210 విల్లాలు ఉండగా.. అవన్నీ జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు విల్లాల పక్కన ఉన్నే వాగు పొంగి ప్రవహించింది. దానికి తోడు చుట్టూ కొత్తగా నిర్మించిన పలు కమ్యూనిటీ విల్లాస్‌లో నీటి వ్యవస్థలు సక్రమంగా నిర్వహించకపోవటంతో వరద నీరు విల్లాల్లోకి చేరిందిదీంతో రూ. కోట్లు విలువ చేసిన కొనుగోలు చేసిన విల్లాల్లోకి నీరు చేరింది. గ్రౌండ్ ఫ్లోర్‌లోకి వరద చేరటంతో ఖరీదైన సోఫాలు, ఇంటి సామగ్రి తడిసిపోయాయి. లక్షల ఖరీదైన కార్లు నీట మునిగాయి. చెరువును తలపిస్తూ కమ్యూనిటీ ప్రాంతమంతా నీటితో నిండిపోయింది. బయట పరిస్థితిని చూసిన పలువురు విల్లావాసులు లబోదిబోమని నెత్తినోరూ బాదుకుంటున్నారు. తాగటానికి మంచినీరు కూడా లేదని.. పాలు, నిత్యవసర సరుకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. కోట్లు పెట్టి విల్లాలు కొనుగోలు చేసి ఇప్పుడు రోడ్డు మీద పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాగా, కాలువలు, చెరువులు కబ్జా చేసి విల్లాలు నిర్మించటం వల్లే వరద పోటెత్తిందనే ఆరోపణలు వస్తున్నాయి. నాలా ప్రవాహానికి అడ్డుగా ఈ విల్లాలు నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానికంగా ఉన్న చెరువులలోకి వెళ్లాల్సిన వరద నీటిని దారి మళ్లించటంతోనే విల్లాలు నీట మునిగాయని అంటున్నారు. వీటిపై కూడా హైడ్రా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీంతో హైడ్రా వీటిపై ఏ మేరకు చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# సీఎంఆర్‌ఎఫ్ స్కామ్ మాములుగా లేదుగా

**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) స్కామ్‌లో ప్రభుత్వ నిధులను స్వాహా చేసేందుకు నకిలీ మెడికల్ బిల్లులు సమర్పించిన ఇద్దరు వ్యక్తులను తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల నుంచి సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందాయి. దీంతో ఆగస్టు 23న ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.నిరుపేద రోగుల వైద్యం కోసం ఉద్దేశించిన (సీఎంఆర్‌ఎఫ్ నుండి నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై తెలంగాణలోని 27 ఆసుపత్రులపై అవిఆ విచారణ జరుగుతోంది. ఈ ఆసుపత్రులపై ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించింది సీఐడీ. విచారణలో భాగంగా నల్గొండ జిల్లాకు చెందిన నిందితులు గొట్టి గిరి(46), ఆసుపత్రి సూపర్‌వైజర్ లెకిరెడ్డి సైదిరెడ్డి(40)లను పోలీసులు అరెస్ట్ చేశారు.మిర్యాల్‌గూడలో స్థానిక ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఈ వ్యవహారం నడిచినట్లు పోలీసులు గుర్తించారు. డెస్క్‌టాప్ కంప్యూటర్లతో నకిలీ సీఎంఆర్‌ఎఫ్ బిల్లులు సృష్టించి వైద్యులు, ఆసుపత్రుల రబ్బరు స్టాంపులను తయారు చేశారు. నిందితులు ఒక్కో దరఖాస్తుకు రూ.4,000 చొప్పున వసూలు చేసి, నల్గొండలోని అమ్మ హాస్పిటల్, మిర్యాలగూడలోని నవీనా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పేర్లతో అవసరమైన రోగులకు




సహాయం చేయడానికి 19 నకిలీ క్లెయిమ్‌లను సమర్పించారు.నల్గొండలోని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిఐడి) ఆగస్టు 30న ఇద్దరిని అరెస్టు చేసింది. నిందితుల నుంచి నకిలీ మెడికల్ బిల్లులు, రబ్బరు స్టాంపులు, నకిలీ లెటర్ హెడ్‌ల సాఫ్ట్ కాపీలతో కూడిన కంప్యూటర్ హార్డ్ డిస్క్‌తో సహా కీలకమైన సాక్ష్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టు ముందు హాజరుపరచగా, వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. స్కామ్‌లో ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించి అరెస్టు చేసేందుకు తదుపరి విచారణ కొనసాగుతోంది.

# ఖమ్మంలో ఇంకా కన్నీళ్లే

**ఖమ్మం :** ఖమ్మం నగరంలో ఎటు చూసినా నీళ్లే కనిపిస్తున్నాయి. వరదకు చెల్లాచెదురుగా మారిన బాధితుల కన్నీళ్లే తారసపడుతున్నాయి. ఇంకా ఖమ్మం నగరం జల దిగ్బంధంలోనే ఉంది. గోదారిలా ఉగ్ర రూపం చూపించిన మున్నేరు ఇప్పుడిప్పుడే శాంతిస్తోంది. 36 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి ప్రవహించిన మున్నేరు ఖమ్మం నడి బొడ్డున భయానక వాతావరణమే సృష్టించింది. వరద తాకిడికి ఇంకా అనేక ప్రాంతాలు ముంపులోనే ఉండిపోయాయి. వేలాది మంది కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. కొంచెం వరద తగ్గడంతో బురదలో కూరుకుపోయిన ఇండ్లను చూసి బాధితులు ఘోల్లుమంటున్నారు. విలువైన సామాన్లు కొట్టుకుపోయాయి. తిండి గింజలు, తాగునీరు కూడా లేకుండా వరద ముంచేయడంతో బాధితుల వేదన వర్ణనాతీతంగా మారింది.ఒకటో అంతస్తు వరకు నీళ్లు రావడంతో ఏం చేయాలో తెలియక కట్టుబట్టలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశామని బాధితులు వాపోతున్నారు. ఖమ్మం నగరంలో మున్నేరు ఉగ్రరూపం దాల్చడంతో చుట్టూ ఉన్న రామన్నపేట నుంచి దానవాయిగూడెం, బ్రిడ్జి డౌన్, ఎఫ్సీఐ గోడౌన్, ఎంబీ గార్డెన్ పూర్తిగా మునిగిపోయాయి. నయా బజార్ సర్కిల్ నుంచి జూబ్లీ క్లబ్, రైల్వే బ్రిడ్జి వరకు నాలుగు అడుగుల లోతు వరద నీరు వచ్చి చేరింది. బైపాస్ రోడ్ల మీద ఉన్న లారీలు సైతం మునిగిపోయాయి. మోతీనగర్, బొక్కల గడ్డ, నయాబజార్, మంచికంటి నగర్, సుందరయ్య నగర్, ప్రకాశ్ నగర్, శ్రీనివాస్ నగర్ కాల్వకట్ట, ధంసలాపురం నీట మునిగాయి. మూడో పట్టణానికి రంగనాయకుల గుట్ట పెట్టని గోడలా నిలిచింది. ఇదే లేకపోతే గాంధీ చౌక్ నుంచి మొదలకొని ముస్తఫానగర్ మీదుగా జరిగే ప్రమాదం ఊహించుకుంటేనే వెన్నులో వణుకు పుట్టే పరిస్థితి. రైల్వే ట్రాక్ దాటి రాపర్తి నగర్, కూరగాయల మార్కెట్ దాక వరద పోటెత్తింది. 30 ఏళ్ల కిందట వచ్చిన వరద కంటే ఇప్పుడు వచ్చిన వరద దారుణమని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. సర్వం కోల్పోయామని బోరుమంటున్నారు.ముప్ఫై ఏళ్ల క్రితం బైపాస్ రోడ్డు మీదకు మాత్రమే నీళ్లు వచ్చాయి. కానీ తాజాగా మున్నేరు వరద ఖమ్మం చరిత్ర రికార్డ్ నే బ్రేక్ చేసింది. నయాబజార్ సర్కిల్ నుంచి జూబ్లీ క్లబ్, రైల్వే బ్రిడ్జి వరకు నాలుగు అడుగుల లోతు వరద వచ్చింది. బైపాస్ రోడ్ల మీద ఉన్న లారీలు సైతం మునిగిపో యాయి. మోతీనగర్, బొక్కలగడ్డ, నయాబజార్ వెనుక భాగం, మంచికంటి



నగర్, సుందరయ్యనగర్, ప్రకాశ్ నగర్, శ్రీనివాస్ నగర్, కాల్వకట్ట, దంసలాపురం కాలనీల్లో ఇండ్లు మొత్తం మునిగిపోయాయి.శనివారం రాత్రి అతి భారీ వర్షం కురిసింది. దీంతో ఆదివారం ఉదయం నుంచే మున్నేరుకు వరద ఉధృతి మొదలైంది. నిమిషాల వ్యవధిలోనే వరద పెరుగుతున్న తీరును అంచనా వేయడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఫలితంగానే చుట్టుపక్కల కాలనీల ప్రజలు వరద బీభత్సానికి గురయ్యారు. మున్నేరు వరద రెప్పపాటున రావడంతో రెండు మూడు ఫ్లోర్లు బిల్డింగ్ ఉన్న వారు సైతం పైకి ఎక్కి ప్రాణాలు రక్షించుకున్నారు. ప్రతి ఒక్కరి ఇంట్లో అన్ని సామాన్లు తడిచి ముద్దయిపోయాయి.ప్రకాశ్ నగర్ లోని టింబర్ డిపోలు నీటిలో కొట్టుకుపోయి నేలమట్టమయ్యాయి. ప్రతి దుకాణంలోని టేకు కర్రలు, మిషన్లు నీటిలో మునిగి భారీ ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. మున్నేరు పరివాహక ప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రతి ఇంటికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. 31వ డివిజన్ లో పెద్దమ్మ తల్లి గుడి ప్రాంతంలో మున్నేటికి ఆనుకొని నిర్మించిన వెంచర్ లో ఇండ్లు కట్టుకున్న వారందరికీ వరద కన్నీటిని మిగిల్చింది. 15 అడుగులకు పైగా వరద రావడంతో ఇండ్లలోని సామాన్లు మొత్తం బురదలో చిక్కుకుపోయాయి. ఓ పాల వ్యాపారికి గేదెల మరణం తీవ్ర నష్టాన్ని చేకూర్చింది. వరద తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఇండ్లలో చేరిన వరదను తొలిగించుకునే పనిలో పడ్డారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు ఖమ్మం జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# మల్లారెడ్డి నెక్ట్స్ టార్గెట్



**హైదరాబాద్ :** హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ – హైడ్రా. ఈ పేరు వినగానే ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో అక్రమ కట్టడాలు నిర్మించిన వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఎప్పుడు, ఎక్కడి నుంచి, ఏ బుల్డోజర్ వచ్చి తమ ఇళ్లు కూల్చేస్తుందో అని భయం భయంగా గడుపుతున్నారు. ఈ క్రమంలోనే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. నగరంలోని చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా చేసినట్లు ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అడ్డాలో ఏవీ రంగనాథ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఆ ప్రాంతంలో ఉన్న అక్రమ కట్టడాల గురించి ఆరా తీశారు.హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం మేడ్చల్ జిల్లా జవహర్ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మేకల కావ్యకు చెందిన ఫామ్‌హౌస్‌కు అనుమతులు లేవని గుర్తించారు. అంతేకాకుండా అంబేద్కర్ నగర్‌లోని ఇంద్రా చెరువు, డంపింగ్ యార్డు సమీపంలోని నాలా ఆక్రమణకు గురైనట్టు హైడ్రా అధికారులు తేల్చారు. ఇక ఫామ్‌హౌస్‌కు అనుమతులు జారీ చేసిన అధికారులపై.. చెరువు ఆక్రమణలపై అలసత్వం ప్రదర్శించిన అధికారులపైనా చర్యలు తీసుకోనున్నట్టు ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆక్రమణదారులకు ఏవీ రంగనాథ్ వార్నింగ్ ఇచ్చారు. పేద వారిపై అయినా కాస్త జాలి చూపిస్తామేమో గాని.. చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన బడా బాబులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఫామ్‌హౌస్‌లను, నిర్మాణాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చి వేస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు.అయితే పేదల పేరుతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వాన్ని మోసం చేయాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. అలాంటి వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా తాజాగా హైడ్రా కమిషనర్ తన బృందంతో జవహర్ నగర్‌లో పర్యటించడంపై.. ఇక హైడ్రా నెక్ట్స్ టార్గెట్ అక్కడే అని స్థానికులు చర్చించుకుంటున్నారు

# దంతేవాడలో జగన్ చనిపోయినట్టేనా
# మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ



**వరంగల్ :** ఛత్తీస్ గఢ్‌లో మావోయిస్టుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతిచెందారు. అయితే వీరిలో మావోయిస్టు అగ్రనేత మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ ఏ దాదా రణదేవ్ దాదా ఉన్నారు. కేంద్ర మిలిటరీ ఇన్చార్జ్, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ బార్డర్ ఇంచార్జ్ గా వ్యవహరించిన ఏసోబు అలియాస్ జగన్ మృతిచెందినట్టు దంతేవాడ పోలీసులు ప్రకటించారు. మావోయిస్టు అగ్రనేత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందినవాడు కావడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. అగ్రనేత స్వగ్రామం కాజీపేట మండలం టేకులగూడెం అని, ఇటీవల జరిగిన భారీ ఎన్ కౌంటర్ లో జగన్ కూడా చనిపోయాడని దంతేవాడ ఎస్పీ తాజాగా ప్రకటించారు.ఛత్తీస్ గఢ్‌లో ఆపరేషన్ మావోయిస్టుల లక్ష్యంగా బలగాలు కూంబింగ్ ను కొనసాగిస్తున్నాయి. భారీ వర్షాల సమయంలో మావోయిస్టులను ప్రాంతాలు మారుతున్నారు. ఈ క్రమంలో పోలీస్ బలగాల కూంబింగ్ కొనసాగించారు. రెండు రోజుల కిందట ఉదయం జరిగిన ఎన్ కౌంటర్ తొమ్మిది మంది మావోయిస్టులు చనిపోయినట్టు దంతేవాడ పోలీసులు ధృవీకరించారు. ఛత్తీస్ గఢక్ రాష్ట్రంలోని దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు సమాచారం అందింది. దాంతో అప్రమత్తమైన పోలీస్ బలగాలు దంతెవాడ, బీజాపూర్ ప్రాంతంలోని అడవులను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో పోలీస్ బలగాలకు మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో తొమ్మిది మంది మావోయిస్టులు చనిపోయినట్టు దంతెవాడ పోలీసులు ధృవీకరించారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రదేశంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకొని, అనంతరం సైతం కూంబింగ్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలు, వారిపై రివార్డ్ ఎంతంటే..1. రణదేవ్ (మాచర్ల ఏసోబు అలియాస్ జగన్) వరంగల్ నివాసిపై రివార్డు – రూ.25 లక్షలు2. సుశీల మడకం, భర్త జగదీష్.. రివార్డు – రూ.5 లక్షలు3. కుమారి శాంతి, పోస్ట్– 31 ఖఒ సభ్యులు. రివార్డు – రూ.5 లక్షలు4. కోసా మాద్వి, హోదా– మలంగిర్. ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు – రివార్డు– రూ.5 లక్షలు.5. గంగి ముచకి, హోదా– కాటేకల్యాణ్ ఏరియా కమిటీ సభ్యుడు – రివార్డు–రూ.5 లక్షలు.6. లలిత, పోస్ట్– సురక్షా దళ్ సభ్యుడు, రివార్డు – రూ.5 లక్షలు.7. కవిత, పోస్ట్ గార్డ్ ఆఫ్ యాహాజిఅగా ఉన్నారు, ఆమెపై రివార్డు – రూ.5 లక్షలు.8. కమలేష్. ప్లాటూన్ మెంబర్– బీజాపూర్ నివాసి, రివార్డ్ – రూ. 2లక్షల9. హిడ్మే మంకం, సురక్షా దళ్ సభ్యుడు, రివార్డు – రూ.2 లక్షలు


# బీహార్ రాజకీయాల్లో ప్రకంపనలు

**పాట్నా :** బీహార్ రాజకీయాల్లో మరోసారి 'పొలిటికల్ గేమ్' జరగబోతుందా? సింగపూర్ నుంచి ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని తిరిగి రావడంతో బీహార్‌లో రాజకీయ గందరగోళం నెలకొంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, అసెంబ్లీ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ సమావేశమయ్యారు. ఇప్పుడు రెండవ రోజు, ఖీఏఆ ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో లాలూ ప్రసాద్ యాదవ్ సమావేశమవుతున్నారు. ఈ పరిస్థితులన్నింటిని గమనిస్తుంటే, రాష్ట్రంలో కొత్త ప్రయోగానికి స్క్రిప్ట్ రానుకుంటున్నట్లు కనిపిస్తోంది.ముఖ్యమంత్రి సచివాలయంలో సీఎం నితీశ్‌కుమార్, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ సమావేశమయ్యారు. నితీష్–తేజస్విల ఈ వన్ టు వన్ భేటీ అకస్మాత్తుగా జరగలేదు కానీ ప్లాన్ చేసిందే అంటున్నారు పార్టీ వర్గాలు. బీహార్‌లో సమాచార కమిషనర్ నియామకంపై చర్చించేందుకు ఇరువురు నేతలు సమావేశమయ్యారు. సమాచార కమిషనర్ నియామకం కోసం ఏర్పాటు చేసిన కమిటీలో ముఖ్యమంత్రితోపాటు, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు, కేబినెట్ మంత్రి కూడా ఉన్నారు. అందుకే ఇద్దరు నేతలూ సమావేశమయ్యారు. అయితే సమాచార కమిషనర్ పేర్ల గురించి చర్చించడానికి బదులుగా, కొత్త పొలిటికల్ కెమిస్ట్రీని సృష్టించడంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అయితే, ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను కలిసిన తర్వాత తేజస్వి యాదవ్ బయటకు వచ్చినప్పుడు, అతను స్వయంగా మొత్తం పరిస్థితిని ముందుకు తీసుకువచ్చాడు. కొన్ని నియామకాలు జరగాల్సి ఉందని, దీనిపై ముఖ్యమంత్రితో చర్చించామన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అధికారికంగా సమాచారం ఇవ్వనుంది. 65 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే అంశంపై సీఎంతో మాట్లాడినట్లు తేజస్వి తెలిపారు. అయితే ఈ అంశం కోర్టులో ఉందని, దీనిపై తాను కోర్టును ఆశ్రయించినట్లు తేజస్వీ తెలిపారు. ప్రభుత్వం తన అభిప్రాయాలను కోర్టులో తెలియజేయాలని, తాను కూడా తన అభిప్రాయాలను తెలియజేస్తానని అన్నారు.మరోవైపు తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లాలూ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. తన ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన శాసనమండలి సభ్యులు, అభ్యర్థులను లాలూ యాదవ్ పిలిచారు. పార్టీ సంస్థాగతాన్ని బలోపేతం చేసేందుకు




అందరికి పిలుపునిచ్చినట్లు ఆర్జేడీ వర్గాలు పేర్కొన్నాయి. తేజస్వీ యాదవ్ సెప్టెంబర్ 10 నుంచి బీహార్‌లో అభర్ యాత్ర ప్రారంభించనున్నారు. లాలూ యాదవ్ తన పర్యటనను విజయవంతం చేసేందుకు వ్యూహరచన చేయడం ప్రారంభించారని, అందుకే ఆర్జేడీ తన నేతలతో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేసిందని భావిస్తున్నారు.ఒకవైపు బీహార్ సెక్రటేరియట్‌లో నితీష్, తేజస్విలు సమావేశమవుతుండగా, మరోవైపు లాలూ యాదవ్ తన నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నితీష్, తేజస్విల భేటీకి అనేక కారణాలు చెబుతున్నప్పటికీ ఈ భేటీ ఒక్కసారిగా బీహార్‌లో రాజకీయ ఉత్కంఠకు తెర లేచినట్లైంది. సమాచార కమిషనర్ నియామకమే ఈ సమావేశం ఉద్దేశమని తేజస్వి చెప్పారు. ఇది జరిగిన తర్వాత కూడా కేవలం సమాచార కమిషనర్ నియామకానికే పరిమితం కాలేదన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. బీహార్‌లో పొలిటికల్ గేమ్ గురించి ఊహాగానాలు జరుగుతున్నాయి. ఎందుకంటే 2022 లో తేజస్వి, నితీష్ మధ్య అలాంటి సమావేశాలు జరిగాయి. ఆపై రాష్ట్ర రాజకీయ ఆట మారిపోయింది. అదే సమయంలో తేజస్వి యాదవ్ కుల గణన చేయాలనే డిమాండ్‌తో నితీష్‌ను కలిశారు. తేజస్వి డిమాండ్ సహేతుకమైనదని నితీశ్ భావించారు. దీని తరువాత, దీనికి సంబంధించి రెండవ సమావేశం కూడా జరిగింది. దీంతో నితీష్ కుమార్ ఎన్డీయే నుంచి పార్టీ మారి మహాకూటమిలో చేరారు.


## ప్రేమ కావాలి చేజారి రేయ్ దక్కింది...



ప్రతి బియ్యం మెతుకు మీద తినేవాడి పేరు రాసిపెట్టి ఉంటుందన్నట్టు ఈ సామెత సినిమాలకూ వర్తిస్తుంది. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, మన్మథుడు లాంటి క్లాసిక్ బ్లాక్ బస్టర్స్ ఇచ్చిన దర్శకుడు విజయ్ భాస్కర్ కొంత గ్యాప్ తర్వాత చేస్తున్న మూవీ ఉషా పరిణయం. ఆగస్ట్ 2 థియేటర్లలో విడుదల కానుంది. కొడుకు శ్రీకమల్ తో ఆయన తీసిన జిలేబి అంచనాలు అందుకోలేకపోయినా మరోసారి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కు సాయి ధరమ్ తేజ్ ముఖ్యఅతిథిగా రాగా ఒక ఆసక్తికరమైన విషయం బయట పడింది. ఇది పద్నాలుగు సంవత్సరాల క్రితం సంగతి. పవన్ కళ్యాణ్ నిర్మాతగా సాయి ధరమ్ తేజ్ డెబ్యూని తొలుత విజయ్ భాస్కర్ దర్శకత్వంలోనే ప్లాన్ చేశారు. అదే ప్రేమ కావాలి. కానీ ఎందుకో కార్యరూపం దాల్చలేదు. కట్ చేస్తే ఆ కథనే తీసుకుని ఆది సాయికుమార్ ని టాలీవుడ్ కు లాంచ్ చేశారు. మంచి విజయంతో వసూళ్లు, ఆఫర్లు రెండూ తీసుకొచ్చింది. అదే సమయంలో వైవిఎస్ చౌదరి ప్లాన్ చేసుకున్న రేయ్ ద్వారా ఆది సాయికుమార్ పరిచయం కావాలి. కానీ అనూహ్య పరిణామంతో అది కాస్తా సాయి ధరమ్ తేజ్ డెబ్యూ అయ్యింది. ఫలితం ఏమయ్యిందో చూశాం. చిన్న చిత్రాల పెద్ద పోటీ మధ్య ఉషా పరిణయంని తీసుకొస్తున్నారు విజయ్ భాస్కర్. క్లీన్ మూవీగా అన్ని వర్గాలను అలరిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కు సాయి ధరమ్ తేజ్ ముఖ్యఅతిథిగా రాగా ఒక ఆసక్తికరమైన విషయం బయట పడింది. ఇది పద్నాలుగు సంవత్సరాల క్రితం సంగతి. పవన్ కళ్యాణ్ నిర్మాతగా సాయి ధరమ్ తేజ్ డెబ్యూని తొలుత విజయ్ భాస్కర్ దర్శకత్వంలోనే ప్లాన్ చేశారు. అదే ప్రేమ కావాలి. కానీ ఎందుకో కార్యరూపం దాల్చలేదు.

## సినిమా చిన్నది... అండదండలు పెద్దవి



అంతో ఇంతో ఇమేజ్ ఉన్న హీరోలకే ఓపెనింగ్స్ రావడం మహా కష్టమైపోయింది. అలాంటిది ఒక క్యారెక్టర్ ఆర్టిస్టుతో టైటిల్ రోల్ చేయించి దాన్ని రిలీజ్ చేయడమంటే మాటలు కాదు. మారుతినగర్ సుబ్రహ్మణ్యం నిర్మాతలు ఆ రిస్క్ చేశారు. రావు రమేష్ హీరోగా రూపొందిన ఈ కామెడీ ఎంటర్ టైనర్ ఆగస్ట్ 23 విడుదలవుతోంది.

నిన్న ట్రైలర్ వదిలారు. కామెడీ బాగానే వర్కౌట్ చేసినట్టు కనిపిస్తోంది. కుర్రాడు అంకిత్ కొయ్య ఆయన కొడుకుగా కీలక పాత్ర పోషించిన ఈ చిన్న సినిమాకు పెద్ద అండదండలు అందుతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది ఒకరకమైన ఘనతగానే చెప్పుకోవాలి. దర్శకుడు సుకుమార్ భార్య తబిత సుకుమార్ మారుతీ నగర్ సుబ్రహ్మణ్యంకు సమర్పకురాలిగా వ్యవహరించగా రామ్ చరణ్ ద్వారా ట్విట్టర్ లో ట్రైలర్ లాంచ్ చేయించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల డిస్ట్రిబ్యూషన్ మొత్తాన్ని మైత్రి మూవీ మేకర్స్ కొనేసుకున్నారు. సో థియేటర్ల సమస్య రాదు. ఎలాగూ ఆగస్ట్ 15 రిలీజయ్యే డబుల్ ఇస్మార్ట్, మిస్టర్ బచ్చన్, తంగలాన్ మూడింటి నైజామ్ రైట్స్ మైత్రి దగ్గరే ఉన్నాయి.

సో స్క్రీన్లు ఎక్కువ తక్కువ ఎలాంటి అవసరం వచ్చినా మైత్రి నెట్ వర్క్ బ్రహ్మాండంగా ఉపయోగపడుతుంది. పాజిటివ్ టాక్ రావడమొకటే ఆలస్యం. ఒక మధ్యతరగతి తండ్రి సెల్ ఫోన్ కొన్నాక అతని అకౌంట్ లో లెక్కలేనంత డబ్బు వచ్చాక ఏం జరిగిందనే పాయింట్ తో మారుతీనగర్ సుబ్రహ్మణ్యం రూపొందింది. దర్శకుడు లక్ష్మణ్ కార్య నటుడు రావు రమేష్ టైమింగ్ ని ఫుల్లుగా వాడుకున్నట్టు ట్రైలర్‌లో అర్థమైపోయింది.

## మోక్షజ్ఞ ఎంట్రీకి ముహూర్తం ఖరారు..?



నందమూరి అభిమానులు ఎప్పుడెప్పుడాని ఎదురు చూస్తున్న మోక్షజ్ఞ ఎంట్రీకి రంగం సిద్ధమయ్యిందని ఇన్ సైడ్ టాక్. అంతర్గతంగా వినిపిస్తున్న సమాచారం మేరకు సెప్టెంబర్ 6న పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలుపెడతారని తెలిసింది.

ప్రశాంత్ వర్మ దర్శకుడిగా రూపొందబోయే ఈ ఫాంటసీ సోషల్ డ్రామాని పక్కా స్క్రిప్ట్ తో తెరకెక్కించబోతున్నట్టు వినికిడి. ఆన్ స్టాపబుల్ ప్రోమో షూటింగ్ సమయం నుంచే బాలయ్యతో ట్రావెల్ చేస్తున్న ప్రశాంత్ వర్మ అప్పటి నుంచే ఒక ఐడియా చెబుతూ వచ్చారట. ఫైనల్ గా ఒక వెర్షన్ ఇద్దరికీ బాగా నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ వచ్చిందని అంటున్నారు.

## ఓటీటీలోనూ విశేష ఆదరణ!

అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ప్రముఖ పాత్రల్లో నటించిన 'మ్యూజిక్ షాప్ మూర్తి' చిత్రానికి మంచి స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలోకి వచ్చింది. అమెజాన్ ప్రైమ్, ఈటీవీ విన్‌లో ఈ చిత్రం స్ట్రీమింగ్ అవుతోంది.

ఈ నేపథ్యంలో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో అజయ్ ఘోష్ మాట్లాడుతూ, "ప్రతి మనిషి జీవితంలో జరిగే కథే ఇది. సక్సెస్ అయిన వారెవరైనా ఎన్నో కష్టాలు దాటుకొని వచ్చి ఉంటారు. ఈ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు పేరు పేరునా కృతజ్ఞతలు. నన్ను తెలుగు తెరపై చూపించిన మొదటి దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ ఈ సినిమా చూసి, ఫోన్ చేసి అభినందించారు. ఫ్యామిలీ ఎమోషన్స్ బాగున్నాయని చెప్పారు. ఈ సినిమా కథను నమ్మి డబ్బు పెట్టిన నిర్మాతలకు సెల్యూట్. శివ సినిమాను బాగా రూపొందించారు' అని తెలిపారు.

'ఈ కథ విన్నప్పుడే దీనిపై నమ్మకం ఉంది. ఇప్పుడు ఈ సినిమా



ఓటీటీలోనూ మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. బాగా ట్రెండ్ అవుతోంది. ఆడియన్స్ అందరికీ థ్యాంక్స్' అని హీరోయిన్ చాందినీ చౌదరి చెప్పారు. ముఖ్య అతిథిగా వచ్చిన దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ,'ఈ సినిమాను చాలా డిఫరెంట్‌గా రూపొందించారు. కష్టాలు, కన్నీళ్లు కాదు మంచితనంతో కొట్టారు' అని అన్నారు.

## బిచ్చగాడు హీరోకి ఇలాంటి పరిస్థితా..!



కొన్నేళ్ల క్రితం ఎలాంటి అంచనాలు లేకుండా బిచ్చగాడు రిలీజైనప్పుడు కనీసం పోస్టర్ ఖర్చులైనా వస్తాయాని అనుమానపడిన వాళ్ళే ఎక్కువ.

కట్ చేస్తే ఊహించని విధంగా జనం బ్రహ్మరథం పట్టి బ్లాక్ బస్టర్ చేశారు.అయిదు పది కాదు ఏకంగా పాతిక కోట్లకు పైగా వసూళ్లతో అదరగొట్టేసింది. ఇప్పటికీ శాటిలైట్ ఛానల్ లో వచ్చిన ప్రతిసారి మంచి రేటింగ్స్ వస్తుంటాయి. మహేష్ బాబుతో ఢీ కొట్టి సక్సెస్ సాధించడం చిన్న విషయం కాదు. దెబ్బకు హీరో విజయ్ ఆంటోనీకి తెలుగులో ఒక్కసారిగా మార్కెట్ వచ్చింది. ఎంతవేగంగా వచ్చిందో అంతే వేగంగా వరస ఫ్లాపులతో పడిపోయింది.

ఇప్పుడీ ప్రస్తావనకు కారణం తుఫాన్. ఆగస్ట్ 2 ఈ సినిమా విడుదలని గతంలో ప్రకటించారు. దానికి తగ్గట్టే ప్రమోషన్లు చేసుకుంటూ వచ్చారు. తీరా చూస్తే రిలీజ్ డేట్ దగ్గరగా ఉన్నా ఎలాంటి హడావిడి కనిపించడం లేదు. అసలీ టైటిల్ తో ఒక మూవీ వస్తోందనే సంగతే సగటు ప్రేక్షకులకు తెలియకుండా పోయింది.

## కంగువ ముగింపులో కాష్మోరా ప్రవేశం..!



ఇంకా రెండు నెలలకు పైగానే సమయమున్నప్పటికీ కంగువ మీద అంచనాలు అప్పుడే ఓ రేంజ్ లో ఉన్నాయి. రెండేళ్లకు పైగా గ్యాప్ తో సూర్య నటించిన ప్యాన్ ఇండియా మూవీ కావడంతో అన్ని భాషల్లోనూ డిమాండ్ ఎక్కువగా ఉంది.ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన బిజినెస్ ని నిర్మాత జ్ఞానవేల్ రాజా భారీ ఎత్తున ఆశిస్తున్నారు. అక్టోబర్ 10 దసరా కానుకగా రిలీజవుతున్న ఈ విజువల్ గ్రాండియర్ లో దిశా పటాని హీరోయిన్ గా, బాబీ డియోల్ విలన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే.

సూర్య రెండు కాలాలకు సంబంధించిన వీరుడిగా డ్యూయల్ రోల్ చేస్తున్నాడు. కంగువలో చాలా సర్ప్రైజులు ఉంటాయట. ముఖ్యంగా అన్నదమ్ములు సూర్య, కార్తీ ఒకే ఫ్రేమ్ లో కనిపించే ఎపిసోడ్ ఓ రేంజ్ లో పేలిందని చెన్నై టాక్. క్లైమాక్స్ చివరి ఘట్టంలో కార్తీ ఎంట్రీ ఉంటుందని, పార్ట్ 2కి లీక్ ఇచ్చే ముఖ్యమైన ట్విస్టు తన చుట్టే అల్లారని తెలిసింది. అంటే కాష్మోరాగా వస్తాడా లేక ఖైదీ ఢిల్లీగా కనిపిస్తాడా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. ఒకవేళ సూర్య కూడా రోలెక్స్ గా కనిపించినా ఆశ్చర్యం లేదు. టైం ట్రావెల్ కాన్సెప్ట్ కాబట్టి సినిమాటిక్ లిబర్టీని ఎంతైనా వాడుకోవచ్చు. దర్శకుడు సిరుతై శివ చాలా ప్రత్యేకంగా ఈ ఇద్దరి పాత్రలను డిజైన్ చేసినట్టు ఇన్ సైడ్ న్యూస్.

సో ముఖ్యమైన లీకు బయటికి వచ్చేసింది కాబట్టి హైప్ మరింత పెరగడం ఖాయం. నెల రోజులు పూర్తిగా ప్రమోషన్ల కోసమే కేటాయించబోతున్న కంగువ టీమ్ దీన్ని బాహుబలి, ఆర్ఆర్ఆర్ రేంజ్ లో పబ్లిసిటీ చేయాలని చూస్తున్నారు. కేరళ, కర్ణాటకలో ఉదయం నాలుగు గంటల నుంచే షోలు వేసేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. టైం ట్రావెల్ కాన్సెప్ట్ కాబట్టి సినిమాటిక్ లిబర్టీని ఎంతైనా వాడుకోవచ్చు. దర్శకుడు సిరుతై శివ చాలా ప్రత్యేకంగా ఈ ఇద్దరి పాత్రలను డిజైన్ చేసినట్టు ఇన్ సైడ్ న్యూస్.

## ఘనంగా దర్శక సంజీవని మహోత్సవం..

తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ తమ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దర్శక సంజీవని మహోత్సవం పేరుతో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో విజరు దేవరకొండ ముఖ్య అతిథిగా పాల్గొనగా, దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్, ఉపాధ్యక్షులు సాయి రాజేశ్, నిర్మాత టీజీ విశ్వప్రసాద్, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజతో పాటు దర్శకుల సంఘం సభ్యులు, చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ హెల్త్ కార్డులను దర్శకరత్న దాసరి నారాయణరావు పేరు మీద దాసరి హెల్త్ కార్డుగా సభ్యులకు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ మాట్లాడుతూ, 'అసోసియేషన్ మూలధనం ముట్టుకోకుండా ఫండ్స్ సేకరించి



ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లే ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఉచిత హెల్త్ కార్డ్స్ అందిస్తుండటం సంతోషంగా ఉంది' అని అన్నారు.

## కంగువ ముగింపులో కాష్మోరా ప్రవేశం....





ఇంకా రెండు నెలలకు పైగానే సమయమున్నప్పటికీ కంగువ మీద అంచనాలు అప్పుడే ఓ రేంజ్ లో ఉన్నాయి. రెండేళ్లకు పైగా గ్యాప్ తో సూర్య నటించిన ప్యాన్ ఇండియా మూవీ కావడంతో అన్ని భాషల్లోనూ డిమాండ్ ఎక్కువగా ఉంది.ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన బిజినెస్ ని నిర్మాత జ్ఞానవేల్ రాజా భారీ ఎత్తున ఆశిస్తున్నారు. అక్టోబర్ 10 దసరా కానుకగా రిలీజవుతున్న ఈ విజువల్ గ్రాండియర్ లో దిశా పటాని హీరోయిన్ గా, బాబీ డియోల్ విలన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే. సూర్య రెండు కాలాలకు సంబంధించిన వీరుడిగా డ్యూయల్ రోల్ చేస్తున్నాడు. కంగువలో చాలా సర్ప్రైజులు ఉంటాయట. ముఖ్యంగా అన్నదమ్ములు సూర్య, కార్తీ ఒకే ఫ్రేమ్ లో కనిపించే ఎపిసోడ్ ఓ రేంజ్ లో పేలిందని చెన్నై టాక్. క్లైమాక్స్ చివరి ఘట్టంలో కార్తీ ఎంట్రీ ఉంటుందని, పార్ట్ 2కి లీక్ ఇచ్చే ముఖ్యమైన ట్విస్టు తన చుట్టే అల్లారని తెలిసింది. అంటే కాష్మోరాగా వస్తాడా లేక ఖైదీ ఢిల్లీగా కనిపిస్తాడా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్.

ఒకవేళ సూర్య కూడా రోలెక్స్ గా కనిపించినా ఆశ్చర్యం లేదు. టైం ట్రావెల్ కాన్సెప్ట్ కాబట్టి సినిమాటిక్ లిబర్టీని ఎంతైనా వాడుకోవచ్చు. దర్శకుడు సిరుతై శివ చాలా ప్రత్యేకంగా ఈ ఇద్దరి పాత్రలను డిజైన్ చేసినట్టు ఇన్ సైడ్ న్యూస్.

సో ముఖ్యమైన లీకు బయటికి వచ్చేసింది కాబట్టి హైప్ మరింత పెరగడం ఖాయం. నెల రోజులు పూర్తిగా ప్రమోషన్ల కోసమే కేటాయించబోతున్న కంగువ టీమ్ దీన్ని బాహుబలి, ఆర్ఆర్ఆర్ రేంజ్ లో పబ్లిసిటీ చేయాలని చూస్తున్నారు. కేరళ, కర్ణాటకలో ఉదయం నాలుగు గంటల నుంచే షోలు వేసేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by **Ramancharla Srikanth** & Printed at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **Title Code: TELTEL 02105**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: rcsrikanth143@gmail.com